


# అద్భుతం

ఆంగ్లమూలం
జోసెఫ్ రడ్‌యార్డ్ కిప్లింగ్

ఒకప్పుడు భారతదేశంలో స్వతంత్ర్య మనిపించుకునే సంస్థానానికి ఒక ప్రధానమంత్రి ఉండేవాడు. ఆ సంస్థానం దేశ వాయువ్యదిశగా ఉండేది. ప్రధానమంత్రి బ్రాహ్మణుడు; ఆయన ఎంత ఉన్నత కులజు డంటే ఆయునకు కులమంటే ఓ అర్థ ముందనే భావనే కలిగేది కాదు. గమ్మత్తయిన వస్త్రధారణలో పాతకాలపు హిందూ సంస్థానసభకు హాజరయ్యే సభికుల్లో ఆయునతండ్రి ఓ ప్రముఖ అధికారి. అయితే, పూరన్‌దాసు పెరిగి పెద్దవా డవుతున్న రోజుల్లోనే గ్రహించాడు, పాత తరం గతించి కొత్తమార్పులు వస్తున్నాయని. ఏ వ్యక్తి అయినా ప్రపంచంలో గొప్పగా బతకాలంటే ఇంగ్లీషువాళ్లతో సాన్నిహిత్యం పెంచుకోవాలనీ, ఇంగ్లీషువాళ్లు మంచి అని భావించే ప్రతిదాన్నీ అనుకరించాలనీ తెలుసుకున్నాడు. అయితే, అదే సమయంలో తన సంస్థానాధీశుడి కరుణాకటాక్షలకూ సంస్థానంలోని అధికారి పాత్ర మవాల్సి ఉంటుంది. ఇది కష్టమైన పనే. అయితే, ప్రశాంతంగా నోరువిప్పకుండా ఉండే ఆ బ్రాహ్మణ యువకుడు బొంబాయి యూనివర్శిటీలో పొందిన ఆంగ్లవిద్య సాయంతో ఆ పనిని సులువుగా నిర్వహించగలిగాడు; పై పదవులకు ఎదిగాడు; చివరకు రాజ్యానికి ప్రధానమంత్రి అయాడు. అంటే అర్థం...మహారాజుకంటే అధికమైన అధికారం ఉన్నవ్యక్తి ఆయన.

ముసలిరాజు ఇంగ్లీషువాళ్లను శంకాదృష్టితో చూసేవాడు. వాళ్ల రైల్వేలన్నా, టెలిగ్రాఫులన్నా ఆయనకు అనుమానమే. ఆయన పోయాక ఆంగ్లవిద్య నభ్యసించిన యువరాజు రాజు అయ్యాడు. రాజుకీ, మంత్రికీ మధ్య మంచిసయోధ్య ఉండేది. పనంతా తానే చేసినా, పేరుమాత్రం రాజుకే వచ్చేట్టు జాగ్రత్త పడేవాడు మంత్రి. వాళ్లు సంస్థానంలో బాలికా పాఠశాలలను స్థాపించారు; రోడ్లు వేయించారు; ఆసుపత్రులు తెరిచారు; వ్యవసాయపు పనిముట్ల ప్రదర్శనలను నిర్వహించారు. ఏడాది కోసారి 'సంస్థాన నైతిక, వస్తు పురోగతి'ని గూర్చి ఓ బ్లూ బుక్కును ప్రచురించేవారు. అది చూసి ఫారెన్ ఆఫీసువార్లూ, భారత ప్రభుత్వంవారూ ఎంతో సంతోషపడి పోయేవారు. కారణం...పూరన్‌దాస్‌లా ఆంగ్లప్రగతిని విశ్వసించినట్లు కన్పించే దేశీయ సంస్థానాధికారులు చాల తక్కువమంది. ఆంగ్లేయుడికి మంచి చేసేది ఏదైనా ఆసియా ఖండవాసికి మరింత మేలు కలిగించేదే అని ఆయన నమ్మేవారు. వైస్‌రాయ్‌లకు, గవర్నర్లకు, లెఫ్టినెంట్ గవర్నర్లకు, మెడికల్ మిషనరీలకు, మామూలు మిషనరీలకు, సంస్థానపు అడవుల్లో వేటాడడానికి వచ్చే ఇంగ్లీషు అధికారులకు, చలికాలంలో భారత పర్యటన చేస్తూ ఏ పని ఎలా నిర్వహించాలో ప్రదర్శించే ఇంగ్లీషు టూరిస్టులకు....అందరికీ ఈ ప్రధానమంత్రి మిత్రుడే! తన కున్న ఖాళీ

సమయంలో ఆయన ఇంగ్లీషు వైద్యం, ఇంగ్లీషు పారిశ్రామిక విద్యను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసేవాడు; ఇండియాలో పేరున్న పత్రిక 'పయొనీర్'లో తమ రాజుగారి లక్ష్యాలు, ఆదర్శాలగూర్చి వ్యాసాలు రాస్తూండేవాడు.

చిట్టచివరకు ఆయన సందర్శనార్థం ఇంగ్లండు వెళ్లాడు. పూరన్‌దాస్ ఉన్నత కులజుడైన బ్రాహ్మణుడైతే మాత్రమేం; సముద్ర ప్రయాణంవల్ల కులభ్రష్టు డయ్యాడు ఆయనకూడా. అయితే, తిరిగివచ్చాక పురోహితులకు డబ్బు వెదజల్లి ఆ ప్రమాదంనుండి బయటపడ్డాడు. లండనులో కలుసుకోవాల్సిన ప్రపంచ ప్రఖ్యాత పురుషుల నందర్నీ ఆయన కలుసుకున్నారు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాడు. పేరున్న యూనివర్సిటీలు ఆయనకు గౌరవపట్టా లిచ్చాయి. ఆయన అక్కడ ఉపన్యాసా లిచ్చాడు. హిందూ సమాజ సంస్కరణమీద గంభీరంగా ప్రసంగించారు. సాయంత్రం ఈవెనింగ్ డ్రెస్సు వేసుకుని డిన్నరు పార్టీకి వెళ్తే, లండను మహిళలంతా ముక్తకంఠంతో ఆయ నంత ఆకర్షణ కలిగించేవ్యక్తి మరొకడు లేడని కొనియాడారు.

ఆయన ఇండియాకు తిరిగివచ్చాక ఆయనకు జరిగిన సత్కారానికి అంతే లేదు. రాజప్రతినిధే స్వయంగా సంస్థానానికి విచ్చేసి మహారాజుకు 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు ప్రదానం చేశారు. క్రాస్‌మీద తాపిన వజ్రాలు, రిబన్లు, ఎనామెల్...అద్భుతం! అదే ఉత్సవసభలో ఫిరంగులు పేలుతుండగా పూరన్‌దాసుకు 'నైట్ కమాండర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్' బిరుదు నిచ్చారు; అలా ఆయనపేరు సర్ పూరన్‌దాస్, కె.సి.ఐ.ఇ. అయింది.

ఆరోజు సాయంత్రం రాజ ప్రతినిధి గౌరవార్థం ఇచ్చిన విందులో గుండెలమీద బిరుదు బాడ్జి, కాలర్ మెరుస్తూ ఉంటే, తన ప్రభువు ఆయురారోగ్యాలను కోరుతూ ఆంగ్లంలో ఆయన చక్కటి ప్రసంగం చేశాడు. అంత చక్కగా ఇంగ్లీషువాళ్లుకూడా మాట్లాడలేరు.

ఆ తర్వాతి నెలలో సంరంభం ముగిసి సద్దుమణిగాక, ఏ ఇంగ్లీషువాడూ కలలోకూడా తను చెయ్యాలని ఊహించనివని చేశాడు పూరన్‌దాస్; ప్రాపంచిక వ్యవహారాలకు సంబంధించినంతవరకు ఆయన చనిపోయినట్లే. తనకు ప్రసాదించిన వజ్ర ఖచితమైన బిరుదు లాంఛనం తిరిగి భారత ప్రభుత్వాన్ని చేరింది. కొత్త ప్రధానమంత్రి పదవీబాధ్యతలు చేపట్టాడు; కింది ఉద్యోగ నియామకాల్లోకూడా పెనుమార్పు వచ్చింది. ఏం జరిగిందో పురోహితుడికి తెలుసు; ప్రజలు ఊహించారుకాని, ఒక్క భారతదేశంలో మాత్రమే మనిషి తా ననుకున్నది చేయగలడు; ఎందు కలా చేశావని ఎవరూ అతన్ని అడగరు. దివాను పూరన్‌దాస్, కె.సి.ఐ.ఇ. తన పదవికి రాజీనామా చేశాడు; అధికారాన్ని, సంసారాన్ని త్యజించి కాషాయిబట్టలు ధరించి సన్యాసై, చేతిలో బిక్షాపాత్ర పట్టుకుని వీధిలో కొచ్చాడన్న సత్యం అసామాన్య విషయమని ఎవరూ భావించలేదు. ప్రాచీన ధర్మాల ననుసరించి యువకుడిగా ఇరవయ్యేళ్లు గడిపాడు; జీవితంలో ఏ ఆయుధాన్నీ పట్టకపోతేనేం...యోధుడిలా ఇరవయ్యేళ్లు గడిపాడు, ఇరవయ్యేళ్లు గార్హస్థ జీవితం గడిపాడు. తన ధనాన్నీ, అధికారాన్నీ విలువైనవాటి సాధనకు వినియోగించాడు; లభించినప్పుడు ఆదర గౌరవాలను స్వీకరించాడు. సమీప, సుదూర నగరాలను, ప్రజలను చూశాడు. వాళ్లు నిలబడి అందించిన గౌరవాన్ని పొందాడు. ఇంక అవేవీ ఆయన కక్కర్లేదు. మనిషి తనకు ఉపయోగంలేని వస్త్రాన్ని విసర్జించినట్టు ఆయన వాటిని త్యజించాడు.

దండం, కమండలం, జింకచర్మం, బిక్షపాత్రలు ధరించి నగ్నపాదాలతో, ఒంటరిగా నేలమీద దృష్టి నిలిపి ఆయన నగరద్వారం దాటి నడుస్తూ ఉంటే, ఆయన వెనక కోట బురుజులనుండి ఫిరంగులు మోగుతున్నాయి. ఆయన వారసుడి గౌరవార్థం. పూరన్‌దాస్ తల ఊపాడు. ఆ జీవితం అంతమైంది. మనిషికి తాను రాత్రి కన్న కలపట్ల ఈర్ష్యాద్వేషాలూ, ప్రేమానురాగాలు లేనట్లే ఆ జీవితంపట్ల అయన కే బంధమూ లేదు. తను సన్యాసి...తల దాచుకునేందుకు ఇల్లులేని బిక్షువు. తిన తిండి ఉన్నంతకాలం భారతదేశంలో ఏ పూజారీ, ఏ బిక్షువూ పస్తుండ నక్కరలేదు. జీవితంలో ఆయన నెప్పుడూ మాంసం ముట్టలేదు. లక్షాధికారిగా ఉన్నప్పుడుకూడా ఆయన భోజనంకోసం ఖర్చు పెట్టింది చాలాస్వల్పం. లండను నగరంలో ఆయనకు బిరుదు ప్రదానం చేస్తున్నప్పుడుకూడా ఆయన శాంతి, ప్రశాంతతల కలనే కన్నాడు. తనముందు సుదీర్ఘంగా సాగే రహదారి, దుమ్ము కొట్టుకున్న చెప్పుల్లేని పాదాలు, రోడ్డులో మెల్లగా సాగే వాహనాలు, సాయంకాలం బాటసారులు చెట్లకింద వంటకు పొయ్యి వెలిగిస్తే లేచే పొగ...ఇవే

జోసెఫ్ రడ్‌యార్డ్ కిప్లింగ్ 1865 డిసెంబరు 30న బొంబాయిలో జన్మించిన ఆంగ్లేయుడు. తన ఆరో ఏట చదువుకు ఇంగ్లండు వెళ్లాడు. ఇండియాకు 1882లో తిరిగివచ్చిన కిప్లింగ్ ఏడేళ్లపాటు పత్రికా రచయితగా పనిచేశాడు. చిన్నతనంనుండి భారతదేశీయ జీవనంపట్ల ఆయనకు ఆకర్షణ కలిగింది. అదే ఆయన పనిచేసిన పత్రికలలో వచనంగానూ, చిత్రాలుగానూ రూపొందింది. డిపార్ట్‌మెంటల్ డిట్టీస్(1886), ప్లెయిన్ టేల్స్ ఫ్రమ్ ద హిల్స్(1888) ప్రచురితమయ్యాక ఆయన 1889లో ఇంగ్లండు వెళ్లాడు. గొప్ప రచయితగా ఆయన్ని అక్కడ ఆహ్వానించారు. ఆయన 1892లో అమెరికా వెళ్లాడు. అక్కడ ఉన్నకాలంలోనే ఆయన 'ద లైట్ దట్ ఫెయిల్డ్'(1890) తర్వాత 'ద జంగిల్ బుక్స్'(1894-95), కాప్టెన్ కరేజియన్(1897), కిమ్(1901) ప్రచురించాడు. ఆయనకు సాహిత్యంలో నోబెల్ బహుమతి(1907) లభించింది. డెబ్బయ్యేళ్ల వయసులో...1936 జనవరి 18న లండనులో మరణించాడు కిప్లింగ్.

కవిగా అంత పేరు గడించకపోయినా, కథారచనలో ఆయన సిద్ధహస్తుడు. సైనికుల కథలు, పిల్లల కథలు'ఆయన గొప్పగా రాశాడు. జంతువులను పాత్రలుగా చేయడం జంగిల్ బుక్సులో పరాకాష్ఠను చేరుకుంది.

అందుకోవాల్సిన గౌరవాలన్నీ అందుకున్నాక, అవన్నీ తుచ్ఛమని నిరశించి సన్యాసం స్వీకరించడం... భారతీయ జీవనంలో తురీయాశ్రమ పార్శ్వం...ఆయన్ని ఆకర్షించింది. అదే ఆయన 'అద్భుతం' కథలో ప్రదర్శిస్తాడు. కథలో జంతుపాత్రలూ మనకు దర్శన మిస్తాయి.

అనువాదం: కాకాని చక్రపాణి

అప్పుడుకూడా ఆయన దృశించిన దృశ్యాలు.

ఆ కల నిజమయ్యే సమయ మొచ్చినప్పుడు ప్రధానమంత్రి తీసుకోవాల్సిన చర్యలు తీసుకున్నాడు. మూడు రోజుల్లో జన సమ్మర్దంలో కలిసిపోయా డాయన.

చీకటి పడ్డాక రోడ్డు పక్కనున్న ఏ సన్యాసుల మఠంలోనో లేక మట్టిస్తంభాల కాలాపీర్ దేవాలయంలో కులాలు పట్టని యోగుల ఆదరణలోనో జింకచర్మం పరిచి విశ్రమించేవాడు. లేదూ, ఏ హిందూగ్రామపు పొలిమేర్లలోనో, బంజరుభూముల్లోనో....ఎక్కడైనా ఒకటే పూరన్‌దాస్‌కి...ఇప్పటి పూరన్ భగత్(భక్తుడు)కి. భూమి, జనం, ఆహారం...అన్నీ ఒకటే ఇప్పు డాయనకు. ఆయనకు తెలీకుండానే ఆయన పాదాలు ఆయన్ని నడిపించాయి ఉత్తరంగా, ఆపైన తూర్పుదిక్కుగా. దక్షిణంనుండి ఆయన రోహ్‌టక్ వెళ్లాడు; రోహ్‌టక్‌నుండి కర్నల్. కర్నల్‌నుండి శిథిల సోమనాహ్‌కు, ఆ తర్వాత ఎండిన గుగ్గర్ నదీగర్భంగుండా పయనిస్తూ ఓ రోజు ఆయన హిమాలయ పర్వతప్రాంతానికి చేరుకున్నాడు.

తన తల్లి కులు లోయనుండి వచ్చిన బ్రాహ్మణవనిత అని గుర్తుకొచ్చి ఆయన పెదవులపై చిరునవ్వు మొలిచింది. కొండకోనల స్త్రీ ఆమె. మంచుకప్పిన కొండల దర్శనానికి పరితపించేది. తనకు చెందిన చోటుకే వచ్చినట్లనిపించింది ఆయనకు.

బ్రహ్మజెముడు మొలచిన శైవాలిక పర్వత సానువుల నధిరోహిస్తూ, "ఆపైన కూర్చుని జ్ఞాన సముపార్జన చేస్తాను" అనుకున్నాడు పూరన్‌భగత్. సిమ్లాకు వెళ్లే రోడ్డుమీద నడుస్తూ ఉంటే హిమాలయాల చల్లనిగాలులు ఆయన చెవులపక్కగా ఈల లేసుకుంటూ వీచాయి.

కిందటిసారి ఆయన ఇక్కడికి వచ్చినప్పుడు ఎంత పటాటోపం! అశ్వికదళం వెంటరాగా రాజ ప్రతినిధిని కలవడానికి వచ్చాడప్పుడు. రాజ ప్రతినిధి మహాసౌమ్యుడు, మృదుస్వభావి. వాళ్లిద్దరూ ఓ గంటసేపు మాట్లాడుకున్నారు...లండనులో తమ మిత్రులగురించీ, భారతదేశంలోని సామాన్యజనం ఆలోచనల గురించీ. ఈసారి పూరన్‌భగత్ ఎవర్నీ సందర్శించలేదు. మాల్‌లో అడ్డుకొయ్య కానుకుని, కింద నలభై మైళ్లదాకా వ్యాపించిన మైదానాల అద్భుతదృశ్యాన్ని చూస్తూ ఉంటే, స్థానికుడైన ముస్లిం పోలీసు తను ట్రాఫిక్‌కు అడ్డుగా నిలబడి ఉన్నానని చెప్పాడు. పూరన్‌భగత్ సలాం చేసి చట్టాన్ని గౌరవించాడు. చట్టం విలువ ఆయనకు తెల్సు. తన చట్టాన్ని తెల్సుకోడానికే బయల్దేరాడు. అక్కడనుండి కదలి, ఆ రాత్రి ఛోటా సిమ్లాలో ఓ ఖాళీగుడిసెలో కాలక్షేపం చేశాడు. కాని, అది అతనియాత్రలో ప్రథమ పాదమే.

హిమాలయా...టిబెట్ రోడ్డు ననుసరించాడు ఆయన. గట్టి శిలల్ని తొలిచి వేసిన పదడుగుల వెడల్పు మార్గ మది. మధ్యలో వెయ్యడుగుల లోతు అగాథాలపై చెక్కలతో నిర్మించిన దారుమార్గ మది. ఆమార్గం వెచ్చటి, చిత్తడి లోయల్లోకి కుంగుతుంది. సూర్యుడు నిప్పులు చెరిగే పర్వత నగ్నభుజాలనూ అధిరోహిస్తుంది. లేదూ, మహావృక్షాన్ని కిందనుండి పైదాకా ఫెరన్ మొక్కలు కప్పేసిన దట్టమైన అడవులగుండానూ పోతుంది. దోవలో గొర్రెల మందలతోనూ, వాటిని కాచే కుక్కలతోనూ పోయే టిబెట్ గొల్లలను కలిశా డాయన. కట్టెలు కొట్టేవాళ్లూ, పొడుగాటి దుస్తులపై దుప్పట్లు కప్పుకుని టిబెట్‌నుండి భారతదేశం వస్తున్న లామాలూ, గుర్రాలపై పయనించే చిన్నచిన్న కొండరాజ్యాల వార్తాహరులూ, పరివారంతో పుణ్యక్షేత్రం దర్శించవెళ్లే రాజులూ అప్పుడప్పుడూ ఆయనకు తారసపడేవారు. మిగతారోజుల్లో నల్ల ఎలుగుబంట్లు గురగరలు మాత్రం వినపడేవి. ఆయన పయనం మొదలెట్టిన మొదట్లో ప్రపంచపు హోరు ఇంకా చెవుల్లో రింగుమంటూనే ఉండేది. ఆయన ముతీనీ కనుమ దాటాక ఆ హోరు నశించింది. పూరన్‌భగత్ ఏకాకి అయిపోయాడు. గమ్యరహితంగా నడిచాడు; ఆలోచించాడు. కళ్లు నేలపైనా, ఆలోచనలు ఆకాశంలోనూ.

ఓరోజు సాయంత్రం, త నప్పటిదాకా గతించిన వాటిల్లోకెల్లా ఎత్తయిన కనుమ నధిగమించాడు. రెండు రోజులు కొండ ఎక్కితేగానీ, అది సాధ్యపడలేదు. మంచుకప్పిన శిఖరాలకు చేరాడు. పదిహేను-ఇరవై వేల అడుగుల ఎత్తున్న పర్వతాలు అవి. రాయి విసిరేస్తే పడేంత దూరంలో ఉన్నట్లనిపించినా, అవి ఏభై...అరవై మైళ్ల దూరంలో ఉండే పర్వతాలు. కనుమ అంతా చిట్టడవి. దేవదారు చెట్లు, అక్రోట్లు, చెర్రీలు, ఆలివ్ చెట్లతోనూ దట్టంగా ఉంది. దేవదారు చెట్ల నీడలకింద పాడుపడిన కాళీ ఆలయ ముంది. ఆ అమ్మను దుర్గ అనీ, శీతల అనీ పిలుస్తారు. మసూచి జాడ్యం పీడించకుండా అమ్మను కొలుస్తారు.



పూరన్‌భగత్ గుడినేలను చిమ్మి శుభ్రం చేశాడు. గంభీరంగా ఉన్న కాళీ విగ్రహాన్ని చూసి చిరునవ్వు నవ్వాడు. గుడి వెనగ్గా మట్టితో నెగడు తయారు చేసుకున్నాడు. తన జింకచర్మం పరిచి చేతిని దండంమీద ఉంచి, కూర్చుని విశ్రమించాడు.

అక్కడనుండి పదిహేను వందల అడుగుల లోతు లోయలో ఓ గ్రామం. రాళ్లూ, మట్టీ కలిపి కట్టిన ఇళ్లు. గ్రామంచుట్టూతా పరచుకున్న పొలాలు, కళ్లాల రాతి వలయాలదగ్గర మేస్తుండే ఆవులు. లోయలోగుండా చూస్తూ ఉంటే వస్తువుల పరిమాణంగుర్చి కళ్లు మోసపోవచ్చు. ఎదుటి పర్వత సానువులపై గుబురుపొదలు అని మొదటిదృష్టికి అనిపించినా, నిజాని కది వంద అడుగుల దేవదారు వృక్షాల అడవి. లోయలోకి దూసుకెళ్లే గద్ద ఒకటి కనిపించింది పూరన్‌భగత్‌కి. అయితే, అది సగం దూరం చేరకముందే ఒక చుక్కలా అయిపోయింది. కనుమ ఎత్తయిన భాగాన్ని తాకుతున్న మేఘాలు లోయలోకి వేలాడుతున్నాయి. 'ఇక్కడ నాకు శాంతి లభిస్తుంది' అనుకున్నాడు పూరన్‌భగత్.

కొండమనుషులకు కొన్ని వందల అడుగులు ఎక్కడమన్నా, దిగడమన్నా చాలా మామూలు విషయం. పాడుపడిన గుడినుండి పొగ రావడం చూశారు గ్రామస్థులు. వెంటనే గ్రామపూజారి పైకి వచ్చాడు, కొత్తవ్యక్తిని ఆహ్వానించడానికి.

అతను పూరన్‌భగత్ కళ్లల్లోకి...వేలమంది మనుషులను అదుపు చేసిన కళ్లల్లోకి...చూసినప్పుడు పాదాక్రాంతమై పోయాడు. ఒక్క మాటకూడా మాట్లాడకుండా బిక్షాపాత్ర తీసుకుని గ్రామంలోకి వచ్చాడు. "చివరికి మన ప్రాంతాని కో సాధువు వచ్చాడు. అలాంటి మనిషిని నే నెప్పుడూ చూడలేదు. ఆయన మైదానాలకు చెందినవాడు. తెల్లటి మనిషి...సద్బ్రాహ్మణుడు." గ్రామంలోని గృహిణులు పూజారిని అడిగారు: "ఆయన మనతో ఉంటాడా?"

అందరూ సాయపడ్డారు. భక్తుడికోసం రుచ్యమైన ఆహారం వండారు. కొండజనం తిండి చాలా అల్పమైంది. గోధుమలు, బియ్యం, ఎర్రమిరియాలు, లోయ ఏటిలో దొరికే చిన్న

చేవలు, రాతిగోడల తేనెపట్టులనుండి లభించే తేనె, ఎండు జల్దరువళ్లు, వసువుకొమ్ములు, అడవి అల్లం, రొట్టెపిండి ఉంటే శ్రద్ధాళువైన స్త్రీ చేయలేని వసందైన వంటకం ఏం ఉంటుంది? రోజూ భక్తుడికి పూజారి బిక్షపాత్ర నిండుగా ఆహారం పట్టుకెళ్లేవాడు. ఆయన అక్కడే ఉంటారా...అడిగాడు పూజారి. తనకోసం బిక్ష నర్థించడానికి ఆయన కో శిష్యుడు అవసరమా? చలి తట్టుకోడానికి దుప్పటి కావాలా? తీసుకొచ్చిన భోజన పదార్థాలు బావున్నాయా?

పూరన్‌భగత్ భుజించాడు. దాతకు కృతజ్ఞతలు తెలిపాడు. అక్కడ ఉండాలనే తన ఆలోచన. అది చాలు...అన్నాడు పూజారి. సుళ్లు తిరిగిన చెట్టువేళ్లలో గుడిబయట బిక్షాపాత్ర ఉంచితే, భక్తుడికి భోజనం ఏర్పాటు జరుగుతుంది రోజూ. అలాంటి గొప్పమనిషి తమ ప్రాంతంలో ఉండాలని అనుకోవడం తమ కెంతో గౌరవప్రదమైన విషయం...భక్తుడి ముఖంలోకి భయంగా చూస్తూ చెప్పాడు పూజారి.

పూర్ణభక్తుడి దేశదిమ్మరితనాని కది అంతం. ఆయన తన కుద్దేశించిన స్థానానికి వచ్చాడు. ఆ ప్రశాంత స్థానం అతనికోసమే. ఆ తర్వాత కాలం ఆగిపోయింది. గుడిముందు కూర్చున్న ఆయనకే తెలియదు తను బతికున్నాడో, చనిపోయాడో, ఇంద్రియాలను అదుపుచేసిన మనిషో లేక కొండలు, మేఘాలు, మారిపోతుండే ఎండా వానలులా ప్రకృతిలో ఒక భాగమో?! భగవన్నామం లక్షలసార్లు జపించేవాడు. భగవన్నామం పలికిన ప్రతిసారీ తను శరీరాన్నుండి బయటపడి, అద్భుతంగా ఆవిష్కృతమైన ద్వారానికి చేరినట్లు అనిపించేదికాని, తలుపు తెరుచుకుంటున్న తరుణంలో శరీరం ఆయన్ని వెనక్కి లాగేది. విషాదంగా పూరన్‌భగత్ శరీరాకృతిలో తనుండడం గమనించేవా డాయన.

ప్రతిరోజూ ఉదయం గుడిబయట సుళ్లు తిరిగిన చెట్టువేళ్లమధ్య భోజన పదార్థాలతో నింపిన బిక్షాపాత్ర నుంచేవారు. ఒకోసారి బిక్షాపాత్రను పూజారి తీసుకు వచ్చేవాడు; మరెప్పుడో ఊళ్లో ఉంటున్న లడాఖీ వ్యాపారి పుణ్యం మూటగట్టుకోవాలని శ్రమ కోర్చి పైకి ఎక్కి వచ్చేవాడు. కాని, సామాన్యంగా భక్తుడికోసం క్రితం రాత్రి వంట చేసిన స్త్రీనే బిక్షాపాత్ర పట్టుకువచ్చేది. వచ్చాక, ఊపిరి బిగపట్టుకుని గొణిగేది: "నా గురించి ఆ దేవుడికి ఓ మంచిమాట చెప్పు, భక్తుడా! నేను, ఫలానావారి భర్యని, నాగురించి ఆయనకు నివేదించు" అని. అప్పుడప్పుడు ధైర్యమున్న పిల్లవా డెవడైనా బిక్షాపాత్ర పట్టుకు వచ్చేవాడు. అప్పుడు బిక్షాపాత్ర నక్కడ వదేసి తిరిగి చూడకుండా పారిపోవడం గమనించేవాడు పూరన్‌భగత్. ఆయ నెప్పుడూ గ్రామానికి వెళ్లలేదు. అది పటంలాగా ఆయన కాళ్లకిందే కనిపించేది. గుండ్రపు కళ్లం భూమిలో,



గ్రామంలో అదొక్కటే చదునుగా ఉండే ప్రదేశం కనుక, సాయంత్రం పూట జనం పోగవడం కనిపించే దాయనకి. పచ్చటి వంటపొలాలు కనిపించేవి.

సంవత్సరం తిరిగేసరికి వాళ్ల గుడిసెల నలుచదరపు కప్పులు బంగారురంగా లీనుతుండేవి. వంట కోశాక వసలకు అక్కడే ఎండబెట్టేవాళ్లు గ్రామస్థులు. తేనెపట్టు పెంపకం, వరినాట్లు, కోత, నూర్పిడి...అన్నీ ఆయన కళ్లముందే జరిగిపోతూ ఉండేవి.

భారతదేశంలో జనసాంద్రత అధికంగా ఉన్న ప్రదేశాల్లోకూడా ఏ జంతువో తాకకుండా మనిషి నిశ్చలంగా కూచుని ఉండలేడు. ఈ అడవిలోకూడా అదే జరిగింది. అడవి జంతువులకు కాళీ ఆలయం సుపరిచితం. అవి వచ్చి ఈ చొరబాటుదారుణ్ణి చూశాయి. లాంగూర్లు, హిమాలయాల మీసాల కోతులు, మొదటగా వచ్చాయి. కతూహలంతో ఆయన్ని చూశాయి. బిక్షాపాత్రను కిందకు తోశాయి. నేలమీద దాన్ని దొర్లించాయి. ఇత్తడి తాపిన దండాన్ని కొరికి చూశాయి. జింకచర్మాన్ని పట్టి చూశాయి. అంతా అయ్యాక, అంత నిశ్చలంగా కూర్చున్న ఆ మానవుడు కీడు చేసేవాడు కాదన్న నిర్ధారణ కి వచ్చాయి. సాయంత్రాల్లో దేవదారు వృక్షాలనుండి కిందకు దూకేవి. తినేందు కేమైనా పెట్టమని చేతులతో అర్థించేవి. ఆ తర్వాత ఊగుతూ, దుముకుతూ వెళ్లిపోయేవి. నెగడు వెచ్చదనంకూడా వాటికి నచ్చింది. దానిచుట్టూ చేరేవి. మరిన్ని కట్టెలు నెగడులో వేయడానికి పూరన్‌భగత్ వాటిని పక్కకు తోయాల్సి వచ్చేది. ఉదయం లేచేసరికల్లా ఏ కోతో ఆయన దుప్పటిలో దూరి నిద్రపోతూ కనిపించేది. పగలంతా ఆ జాతిసభ్యుల్లో ఎవరో ఒకరు ఆయన పక్కన కూర్చుని మంచును చూస్తూ, గొణుక్కుంటూ చెప్పలేనంత జ్ఞానసంపన్నంగా, విషాదంగా కనిపించేది.

కోతులతర్వాత వచ్చింది బారాసింగ్, పెద్ద లేడి...జింక. తన శృగాల ముఖమల్‌ను కాళీ విగ్రహపు చల్లని బండకేసి రుద్దుకోవాలని వచ్చిన ఆ లేడి గుళ్లో ఆ మనిషిని చూశాక కాళ్లు నేలకేసి కొట్టింది. కాని, పూరన్‌భగత్ కదలలేదు. మెల్లమెల్లగా కదిలింది ఆ రాచజింక. ఆయన భుజాన్ని వాసన చూసింది. వేడిగా ఉన్న దాని కొమ్ములపై తన చల్లని చేతులతో నిమిరాడు పూరన్‌భగత్. చికాగ్గా ఉన్న జంతువుకు ఆ మృదుస్పర్శ హాయి అనిపించింది. ఆ తర్వాత బారాసింగ్ తన పెంటిని, బిడ్డను తీసుకువచ్చింది. లేదూ; ఎప్పుడో రాత్రిపూట నెగడుమంటకు దాని పచ్చటికళ్లు మెరుస్తూ ఉంటే, తాజా ఆక్రోట్లలో తన భాగం పంచుకోడానికి వచ్చేది. చివరికి వచ్చింది కస్తూరి మృగం. మహాసిగ్గరి. చిన్నశరీరం. పూరన్‌భగత్ వాటిని 'తమ్ముళ్లూ' అని పిలిచేవాడు. మధ్యాహ్నా మెప్పుడైనా ఆయన 'తమ్ముళ్లూ' అని పిలిస్తే, అడవిలో కూతవేటు దూరంలో ఉంటే పరుగెత్తుకుంటూ ఆయన దగ్గరకు వచ్చేవి అవి. హిమాలయాల నల్ల ఎలుగుబంటి...గడ్డంకింద వంగనామంలాంటి తెల్లచారలున్న సోనా అటుగా చాలాసార్లు వచ్చింది. భక్తుడు భయాన్ని ప్రదర్శించక పోవడంతో, సోనాకూడా కోపాన్ని ప్రదర్శించలేదు. కాని, గమనించసాగింది. మెల్లగా దగ్గరకు వచ్చింది. తన్ను మృదువుగా, లాలనగా స్పృశించాలని కోరింది. రొట్టె లేక అడవిపళ్ల బిచ్చాన్ని అర్థించింది. తరుచూ, నిశ్శబ్దపు తొలిపొద్దుల్లో పూరన్‌భగత్ మంచుశిఖరాల నధిరోహించి వచ్చే అరుణిమను తిలకించడానికి కనుమపైకి ఎక్కినప్పుడు ఆయన కాళ్లదగ్గర 'గురగుర' శబ్దం చేస్తూ, కాళ్లు మారుస్తూ, తన ముందుకాలును కిందపడి ఉన్న కలపమొద్దు కిందకు దూర్చి 'ఉఫ్'మంటూ మహా అసహనంగా దాన్ని పక్కకు తోస్తూండేది; లేదూ, ఆయన వేకువనే లేచి నడుస్తూంటే ముడుచుకు పడుకుని ఉన్న సోనా అధాటున లేచి నిలబడి దాడి చెయ్యడానికి సిద్ధమయ్యేది. భక్తుడి గొంతు విని, అది తన పరమ మిత్రుడని తెలుసుకున్నాక మళ్లా మునగదీసేది.

నగరాలకు దూరంగా నివశించే సాధుసన్యాసులు ఆటవిక ప్రాణులతో అద్భుతాలు చేయించగలరన్న పేరుంటుంది. ఆ అద్భుతం మరేం కాదు. నిశ్చలంగా ఉండగలగడంలో,

హడావుడి కదలిక ప్రదర్శించక పోవడంలో, చాలాసేపు ఆగంతుకుడివంక సీదా చూడకపోవడంలో ఉంది ఆ మహిమ. గుడివెనగ్గా దట్టమైన అడవిలో బారాసింగ్ రేఖామాత్రంగా నీడలా పాకిపోవడం గ్రామస్థులు చూశారు. కాళీ విగ్రహంముందు తన రంగులరెక్కలతో మెరిసే హిమాలయాల అడవిపక్షి మినాల్‌నూ చూశారు. లాంగూర్లు రొండిమీద కూర్చుని అక్రోటు డిప్పలతో ఆడుకోవడం చూశారు. జారిన బండలవెనక ఎలుగుబంటి వద్ధతిలో సోనా తనలో తను పాడుకోవడం కొంతమంది పిల్లలు విన్నారు. భక్తుడు మహిమలు కలవాడన్న పేరు స్థిరపడి పోయింది.

అద్భుతాలూ, మహిమలూ లాంటివాటికి ఆయన ఎంతో దూరం. ఈ ప్రపంచమే ఓ గొప్ప అద్భుతమని ఆయన నమ్మకం. ఏ మనిషికైనా అది అర్థమైతే అది ఆధారంగా ముందుకు వెళ్లగలడు ఆ మనిషి. ప్రపంచంలో గొప్పదిగానీ, తక్కువదిగానీ లేదని ఆయనకు నిశ్చయంగా తెలుసు. రాత్రింబవళ్లూ వస్తుమూలాల్లోకి చూస్తూ తన ఆత్మ వచ్చినచోటు గురించి ఆలోచిస్తూనే గడిపేవాడు.

ఆ ఆలోచనల్లో కాలం గతించింది. తలమీది జుట్టు జడలు కట్టింది. దండం ఆనేచోట బండమీద రంధ్రమైంది. బిక్షాపాత్ర ఉంచే చోటుకూడా కుదియబడింది. నెగడుదగ్గర తను ఏ జాగాలో కూర్చోవాలో ప్రతి జంతువుకూ తెలిసిపోయింది. ఋతువులతోపాటు పొలాల రంగులూ మారాయి. కళ్లాలు శుభ్రం చేయడం, నూర్చడం...ఎన్నోసార్లు జరిగిపోయింది. గ్రామంలో మార్పు లొచ్చాయి. పూజారి ముసలివాడై పోయాడు. అంతకుముందు బిక్షాపాత్రను పట్టుకువచ్చిన పిల్లలు ఇప్పుడు తమ పిల్లలతో బిక్షాపాత్రను పంపసాగారు. ఇప్పుడు మీ రడగండి గ్రామస్థుల్ని: కనుమకు పైనున్న కాళీ ఆలయంలో ఆ సాధువు ఎప్పటినుండి ఉంటున్నాడని; 'ఎప్పుడూ' అని సమాధాన మిస్తారు.

ఆ వేసవికాలంలో వానలు వచ్చాయి. ఈ మధ్యకాలంలో అలాంటి వానలు కొండల్లో కురవలేదు. మూడు నెలలనుండి లోయ మేఘావృతమయ్యే ఉంది. కుండపోత వాన. ఉరుములు, పిడుగులు. కాళీ ఆలయం మేఘాలకు పైన ఉంది. ఓ నెలపైగా భగత్ గ్రామాన్ని చూడలేకపోయాడు. మేఘాలు అంత దట్టంగా కమ్ముకున్నాయి.

చిన్నచిన్న జలప్రవాహాల శబ్దంతప్ప ఆయన విన్నదేం లేదు. పైన చెట్లనుండి కింద నేలమీద దేవదారు ముళ్లని తడుపుతూ తడిసిన ఫెరన్ ఆకులనుండి జాలువారుతూ, కొండవాలుల్లో కొత్త బురదకాలువ లేర్పరుస్తూ జలాలు ధారలు కట్టాయి. అప్పుడు సూర్యుడు వెలిగాడు; దేవదారులు, గన్నేరుల సుగంధాన్ని వెలికితీశాడు. 'మంచుసుగంధం' అంటారు కొండమనుషులు దాన్నే. ఓ వారం రోజులు విపరీతమైన ఎండ కాసింది. మళ్లీ వానలు కుండపోతగా కురవడం మొదలెట్టాయి. ఆరోజు రాత్రి పూరన్‌భగత్ పెద్ద నెగడే చేశాడు. తన తమ్ముళ్లకు వెచ్చదనం కావాలి. కాని, ఒక్క జంతువుకూడా గుడికి రాలేదు. ఆయన వాటిని పిల్చిపిల్చి అలసిపోయాడు. అడవిలో ఏం జరిగిందా అని ఆలోచిస్తూ ఉంటే నిద్ర పట్టిం దాయనకు.

నడిమి చీకటిరాత్రిలో, కురిసే వర్షపుహోరు మృదంగ ధ్వానంలా ఉంటే ఎవరో తన దుప్పటి పట్టుకుని లాగుతున్నట్లుంటే ఆయనకు మెలకువ వచ్చింది. చెయ్యి సాచితే లాంగూర్(కోతి) చెయ్యి అందింది ఆయనకు. "చెట్టుమీదకంటే ఇక్కడే బావుంటుంది" అన్నా డాయన నిద్రమత్తులో. దుప్పటి వదులుచేస్తూ, "దూరు లోపలికి...వెచ్చగా ఉంటుంది" అని చెప్పాడు. కోతి ఆయన చెయ్యి పట్టుకుని గట్టిగా లాగింది. "మరైతే తిండా?" అడిగాడు పూరన్‌భగత్. "ఉండు చూస్తాను...ఏమైనా ఉందేమో." ఆయన మోకాళ్లమీద నిలబడి నెగడులోకి కట్టెముక్కలు వేస్తూ ఉంటే లాంగూర్ గుడిద్వారం దగ్గరకు పరుగెత్తింది. తొంగి చూసి, మళ్లీ పరుగెత్తుకుంటూ వచ్చింది, ఆయన మోకాళ్లను పట్టుకుని లాగింది.

"ఏమైంది? నీ కొచ్చిన కష్టమేంటి, తమ్ముడూ?" అనడిగాడు పూరన్‌భగత్. లాంగూర్ కళ్లలోని భయమేమిటో ఆయన కర్థం కాలేదు. "మీ వాడిని ఎవరైన వలవేసి పట్టుకుంటే తప్ప, నే నీ వాతావరణంలో బయటికి రాలేను. అయినా, ఇక్కడ వల వేసి మిమ్మల్ని పట్టుకునేవా ళ్లెవరూ లేరే! చూడు, తమ్ముడూ! బారాసింగ్‌కూడా వస్తున్నది ఇక్కడ ఆశ్రమం పొందడానికి."


గుడిలోకి దూసుకువస్తూంటే, జింక కొమ్ము తలుపుకు కొట్టుకున్నాయి. కాళీ విగ్రహానికీ కొట్టుకున్నాయి. పూరన్‌భగత్ దిశగా తల దించి అది అసహనంగా కాళ్లు నేలకేసి కొట్టింది. ఉస్సుమని ముకుపుటాలనుండి గాలి వదిలింది.

"అయ్యయ్యో ఏమిటిది?" అన్నాడు భగత్ వే విరుచుకుంటూ. "రాత్రి ఆశ్రయ మిచ్చేందుకు మవ్వు చెల్లించే మూల్యమా ఇది?" అయితే, జి ఆయన్ని తలుపువైపుగా తోసింది. అంతలో ఊర్పులా ఏదో తెరుచుకోవడం వినిపించింది ఆయనకు. నేల రెండు రాతి పలకలు విడిపోవ కనిపిం చింది. జిగురునేల పెదాలు తడుపుకుంటున్నట్లు అనిపించింది ఆయనకి.

"అర్థమైంది, తమ్ముళ్లూ!" అన్నాడు పూరన్‌భగత్. "ఇవాళ నెగడు దగ్గరకు మీరు రాలేదంటే మీ తప్పేం లేదు. కొండ వడిపోతో అయినా, నే నెందుకు వెళ్లాలి?" ఆయన కళ్లు ఖాళీ బిక్షాపాత్రపై పడ్డాయి. వెంటనే ఆయన ముఖంలో మార్పొచ్చింది. "నే నిక్కడకు వచ్చి ప్పటినుండి వాళ్లు రోజూ నాకు చక్కటి భోజనం పెట్టారు. నే నిప్పుడు వేగంగా కదలకపోతే, రేపటికి లోయలో ఒక్క మనిషి బతికుండడు. వాళ్లకు హెచ్చరిక చెయ్యాలి. ఉండు, తమ్ముడ న న్నోసారి నెగడుదగ్గరకు వెళ్లనీ."

బారాసింగ్ అయిష్టంగానే పక్కకు తప్పుకుం ఓ దేవదారు కట్టెను నెగడులోనికి జొనిపి కాగడాలా జ్వలింపజేశాడు. "మీరు నాకు హెచ్చరిక చెయ్యడానికి వచ్చారుకదూ! అంతక మంచిపనే చేద్దాం. అవును...మంచిపని. తమ్ముడూ, నీ మెడని పట్టుకోనీ నన్ను. నాకు కాళ్లు రెండే" అన్నా డాయన.

అయన కుడిచేత్తో బారాసింగ్ మెడ పట్టుకున్నాడు. ఎడం చేత్తో కాగడా పట్టుకున్నా అలా ఆ కాళరాత్రి గుడిలోనుండి బయటపడ్డాడ గాలి వీచ డం లేదు. కాని, వా కాగడాను ఆర్పేసింది. జింక వేగంగా వాలుకి దిగసా గింది, వెనక కాళ్లమీద జారుతూ. వా అడవినుండి బయట పడగానే భగత్ తమ్ముళ్లు మరికొందరు వాళ్లని కలిశారు. లాంగూర్లు పక్కనే తనని తాకుతూ దిగడ వెనగ్గా 'ఊఊ' అనుకుంటూ సోనా దిగడం ఆయన విన్నాడ చూడలేకపోయినా. ఆయన పలితకేశాలు వానకు జడలు



కట్టాయి. ఆయన నగ్నపాదాలకింద నీరు ధారలు కట్టింది. తడిసిన కాషాయాంబరం ఆయన చిక్కిన ఒంటికి అతుక్కుపోయింది. బారాసింగ్‌మీద ఆని ఆయన కిందకు దిగాడు స్థిరంగా. ఇప్పుడు ఆయన సాధువు...సన్యాసి కాదు. సర్ పూరన్‌దాస్, కె.సి.ఐ.ఇ. అల్పంకాని ఓ రాజ్యానికి ప్రధానమంత్రి. ఆదేశా లివ్వడానికి అలవాటుపడిన మనిషి. ప్రాణాలు కాపాడడానికి బయలు దేరాడు. భక్తుడూ, ఆయన సోదరులూ కొండ ఏటవాలులో దిగారు. దారి బురద. నీరుతో తపతపలాడుతూ జారిపోయేట్టుగా ఉంది. వాళ్లు దిగారు... దిగారు. గ్రామం కళ్లంగోడకు జింకకాళ్లు తాకిందాకా జారారు. అప్పుడు మానవవాసన పసిగట్టిన బారాసింగ్ బుస్సున ఘూర్ణిల్లింది. ఇప్పుడు వాళ్లు వంకర తిరిగి వెళ్లే గ్రామవీథి మొగదల్లో ఉన్నారు. భగత్ తన దండంతో మూసి ఉన్న కంసాలి కిటికీ తలుపులు తట్టాడు. "లేవండి...బయట పడండి" అని అరిచాడు పూరన్‌భగత్. తను మనిషితో మాట్లాడి ఏళ్లయింది. అందుకే ఆయన తనగొంతు తనే గుర్తు పట్టలేకపోయాడు. "హిమపాతం...కొండ పడి పోతోంది. కొండ పడిపోతోంది...లోపల ఉన్నవాళ్లంతా లేచి బయటకు రండి."

"అది మన భక్తుడు" అని అరిచింది కంసాలిభార్య. "ఆయన తన జంతువులతో వచ్చాడు. పిల్లల్ని పంపి అందర్నీ పిలవనంపు."

వార్త ఇంటింటికీ చేర్తూండగా, ఆ ఇరుకైన వీథిలో నిలబడ్డ జంతువులు భగత్‌చుట్టూ ముడుచుకు నిలబడ్డాయి. సోనా అసహనంగా ఆయాస పడిపోతూ ఉంది.

జనం అంతా గాబరా పడుతూ వీథిలోకి వచ్చారు. అంతా కలిసి డెబ్భైమంది. భయకంపితమైన బారాసింగ్‌ని పట్టి భక్తుడు నిలిపి ఉండడం చూశారు జనం కాగడాల వెలుగులో. కోతులు ఆయన చొక్కాను పట్టుకుని ఉన్నాయి దీనంగా. సోనా ముంగాళ్లమీద నుంచుని అరిచింది.

"లోయగుండా ఆ కొండపైకి వెళ్లాలి." అరిచాడు పూరన్‌భగత్. "ఎవర్నీ వదిలెయ్యొద్దు. మేం అనుసరిస్తాం పదండి."

కొండజాతి మనుషులకు ఎలా పరుగెత్తాలో తెలుసు. కొండబెక్కలు విరిగి పడుతున్నాయంటే లోయ కావలివైపున్న ఎత్తయిన ప్రదేశానికి చేరుకోవాలని వాళ్లకు తెలుసు. వాళ్లు పరుగెత్తారు. కాళ్ల కిందున్న నీటి మడుగులను చిమ్ముకుంటూ, ఆవైపుగా ఎత్తు మైదాన పొలాల నధిరోహిస్తూ. భక్తుడు, ఆయన సోదరులు వాళ్లని అనుసరించారు. ఎదురుగా ఉన్న పర్వతం పైపైకి ఎక్కడం ప్రారంభించారు, పేరుపేరునా మనిషిమనిషినీ పిల్చుకుంటూ. వాళ్ల అడుగులను అనుసరించింది బారాసింగ్, శక్తి ఉడిగిన పూరన్‌భగత్ శరీరభారాన్ని మోస్తూ భారంగా. చివరకు జింక ఆగింది. అయిదు వందల అడుగుల ఎత్తున దట్టమైన దేవదారు అడివిలో ఆగింది అది. విరిగి పడబోతున్న కొండబెక్కల ప్రమాదంగూర్చి హెచ్చరించిన సహజాతమే ఆ ప్రదేశం సురక్షితమని దానికి చెప్పింది.

దానిపక్కన పడిపోయాడు పూరన్‌భగత్. స్మారకం పోయే స్థితిలో ఉన్నా డాయన. వానకు తడిసి వణికిపోతున్నాడు. ఆ భయంకర పర్వతారోహణం ఆయన్ని చంపేసింది. మొదటగా బెదరిపోయి ఉన్న కాగడాల నుద్దేశించి చెప్పాడు: "ఆగండి...అందరూ ఉన్నారో, లేదో లెక్కేసుకోండి" అని. దీపాలు దగ్గరగా చేరుతూ ఉంటే, "నేను వెళ్లిపోయిందాకా నా దగ్గరే ఉండు, తమ్ముడూ!" అని మెల్లగా చెప్పాడు జింకతో ఆయన.

గాలిలో ఓ ఊర్పు మొదలైంది. అది ఓ గొణుగుడైంది. అది గర్జనకు పెరిగింది. ఆ గర్జన వినికిడి బుద్ధి గ్రహించలేని స్థాయికి చేరుకుంది. గ్రామస్థులు నిలబడ్డ పర్వతపార్శ్వం చీకట్లో పెద్దదెబ్బకు గురైంది. ఆ దెబ్బకు ఆ ప్రాంతం ఊగిపోయింది. అప్పుడు వినిపించింది ఓ స్థిరనిస్వనం ...లోతుగా, గంభీరంగా. మొత్తాన్నీ ముంచెత్తిం దది. బహుశః ఓ అయిదు నిమిషాలు. అందుకు దేవదారు వృక్షాలవేళ్లుకూడా వణికిపోయాయి. అది అంతరించింది. మైళ్ల గట్టి నేలమీద వాన కురిసే శబ్దమూ, మెత్తటి నేలమీద వినిపించని నీటి వృదంగధ్వనికి గడ్డి పొందిన ఉత్సుకతా తమ సొంతకథలు వినిపించా యప్పుడు.

తమ ప్రాణాలను రక్షించిన భక్తుడితో మాట్లాడే ధైర్యం గ్రామస్థుల్లో ఎవరికీ, పూజారిక్కూడా, లేకపోయింది. తెల్లవారేదాకా దేవదారు వృక్షాలకింద ముడుచుకు కూర్చుండిపోయారు. తెల్లవారాక వాళ్లు లోయలోకి చూశారు. ఒకప్పుడు అడవిగా ఉన్న ప్రాంతం, ఎత్తు మైదాన బెక్కలపైన పొలాలు, కాలిబటలతో సాగే పశువుల మేతభూమీ, అన్నీ పచ్చిగా, ఎర్రగా, విరుచుకు పడిపోయిన మచ్చలా ఉన్నాయి. పడినచెట్లు తలకిందులుగా కందకానికి ఆని ఉన్నాయి. ఆ ఎరుపు తమకు ఆశ్రయమైన కొండకు పై ఎత్తువరకు వ్యాపించింది, పారేనదికి ఆనకట్ట వేస్తూ. అది, ఆ నది, ఇటుకరంగు సరస్సుగా మారడం ప్రారంభించింది. గ్రామం, గుడికుండే దారీ, గుడివెనక అడవీ... ఆనవాలు లేకుడా అంతరించిపోయాయి. మైలు వెడల్పుగా రెండు వేల అడుగుల లోతుకు పర్వతం కిందకు కూలింది; మొత్తాన్నీ చదును చేసింది.

గ్రామస్థులు ఒక్కొక్కరూ భక్తుడికి ప్రణమిల్ల ఆయనవంక తిరిగారు. ఆయన దగ్గరగా నిలబడి ఉంది బారాసింగ్. వాళ్లు రావడం చూసి అది పారిపోయింది. కొమ్మలమీద కూర్చుని లాంగూర్లు రోదించడం, సోనా కొండపైన మూలగడం వాళ్లకి కనిపించింది. కాని, భక్తుడు చనిపోయాడు. పద్మాసనం వేసుకుని ఉన్నాడు; వీపు చెట్టుకు ఆని ఉంది; చేతికింద దండం, ముఖం ఈశాన్యంగా తిరిగి ఉంది.

పూజారి చెప్పాడు: "చూడండి...ఎన్ని అద్భుతాలో...ఇలా కూర్చున్న పద్ధతిలోనే సన్యాసుల్ని సమాధి చేయాలి. అందువల్ల ఆయన ఇప్పుడు ఉన్న చోటునే మన సాధువుకోసం మనం ఒక ఆలయం నిర్మిద్దాం."

ఆయన పోయి ఏడాది కాకముందే వాళ్లు ఒక చిన్న దేవాలయం...రాళ్లు, మట్టితో గుడి కట్టారు. ఆ పర్వతాన్ని 'భక్తి పర్వత'మని పిలిచేవాళ్లు. ఇవాళ్టికీ వాళ్లు అక్కడ దీపాలు వెలిగిస్తూ, పూలతో అర్చిస్తూ, ఆయన్ని ఆరాధిస్తూ ఉంటారు. కాని, తాము పూజిస్తున్న మహనీయుడు దివంగత సర్ పూరన్‌దాస్, కె.సి.ఐ.ఇ., డి.సి.ఎల్., పి.హెచ్‌డి. వగైరా అనీ, బుద్ధికుశలురూ, పురోగమనశీలురూ ఉన్న మోహినీవాలా సంస్థానానికి ఆయన ఒకప్పటి ప్రధానమంత్రి అనీ, గొప్ప విద్యాశాస్త్ర సంఘాలలో గౌరవనీయ సభ్యుడుగా ఉండేవాడనీ...వాళ్లకు తెలీదు.

■

